క్లుప్తంగా

మిరపలో సస్యరక్షణ చర్యలు పాటించండి



మార్కాపురం : రైతులకు సూచనలిస్తున్న ఏఓ శ్రీనివాసులు

మార్కాపురం టౌన్: మిరప తోటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండలంలోని రాయవరం, గోగులదిన్నె గ్రామాల్లో మిరప, కంది పంటను పరిశీలించారు. కందిలో మారుకా మచ్చల పురుగును నివారించుకోవాలని సూచించారు. రబీలో సాగుచేసిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది శివకుమార్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

వీఆర్‌ఓల నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన వీఆర్‌ఓల సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం వీఆర్‌ఓల సంఘ నూతన కార్యవర్గాన్ని మంగళవారం పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అరిగెల వెంకటరామయ్య, ఉపాధ్యక్షుడిగా అనురాజుల లక్ష్మీదేవి, కార్యదర్శిగా బిజ్జం రాజశేఖరరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దూదేకుల ఖాశీంవలి, కోశాధికారిగా ఈశ్వర్‌రెడ్డి, ఆర్గనైజర్లుగా కొండయ్య, వి.రమణ, ఎస్.రామయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీఆర్‌ఓల సమస్యలపై పాటుపడతామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు తెలిపారు. వీఆర్‌ఓలు అందరం కలిసికట్టుగా ఐక్యంగా మెలగాలని జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య తెలిపారు. వీఆర్‌ఓలు స్వర్ణలతారెడ్డి, అచ్చయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డ్రైవర్‌తో ప్రయాణికుడి వాగ్వాదం



ఇంధన పొదుపుపై ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అర్థవీడు: ఓ ప్రయాణికుడు తనపై దాడి చేసినట్లు ఆర్టీసీ డ్రైవర్ చిరంజీవి తెలిపాడు. పాపినేనిపల్లి నుంచి కంభం వచ్చేందుకు ఉదయం 6 గంటలకు బయల్దేరుతున్న సమయంలో ఓ ప్రయాణికుడు మరొకరు వస్తున్నారని, బస్సును కొద్దిసేపు ఆపండని చెప్పాడని, బస్సు బయల్దేరే సమయం దాటుతున్నా ప్రయాణికుడు రాలేదని, దీంతో బయల్దేరామని తెలిపాడు. బస్సు అర్థవీడుకు చేరుకున్న సమయంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చి తనతో వాగ్వాదానికి దిగి తన ముఖంపై కొట్టాడని డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడు. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. బస్సు కొద్దిసేపు ఆపమంటే ఆపకుండా వెళ్లిపోయాడని, తన బ్యాగ్ బస్సులో ఉండటంతో బైక్‌పై వెళ్లి బస్సును ఆపానని, అప్పుడు డ్రైవర్ తనతో వాగ్వాదానికి దిగాడని ప్రయాణికుడు ప్రతాప్‌రెడ్డి చెబుతున్నాడు.

విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత


పొదిలి: విద్యుత్ పొదుపును ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని ఆ శాఖ దర్శి డీఈఈ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాతావరణంలో విషవాయువుల శాతం తగ్గించేందుకు మనం సోలార్ విద్యుత్, పవన విద్యుత్ ఎక్కువగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సహజ సిద్ధమైన వనరులను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా వాతావరణం కాలుష్యం కాకుండా నివారించవచ్చన్నారు. ఎల్ఈడీ బల్బులు, ఐఎస్ఐ బ్రాండ్ ఉపకరణాలతో విద్యుత్‌ను పొదుపు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ మోహన్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం కరిమూన్‌బీబీ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ సతీష్

మార్కాపురం: ఫార్మసీ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరి అని జార్జి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ చెప్పారు. మంగళవారం కళాశాలలో విద్యార్థుల ఇండెక్షన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. వ్యక్తిత్వ వికాసం, నైపుణ్య శిక్షణ కచ్చితంగా అవసరమని చెప్పారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యతను మరిచిపోవద్దని హితబోధ చేశారు. ఇండెక్షన్ కార్యక్రమాన్ని జనవరి 11వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా జయరావు, వ్యక్తిత్వ వికాసం ట్రైనర్ జి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.





సిలిండర్లు సరఫరా చేస్తున్న నిర్వాహకులు

గ్యాస్.. తుస్!

- గ్యాస్ సిలిండర్ల బరువులో వ్యత్యాసం
- ఒక్కో సిలిండర్‌పై కేజీ నుంచి 2 కేజీలు తగ్గుతున్న వైనం
- నష్టపోతున్న వినియోగదారులు
- తూకంలో మోసం లేకుండా చూడాలని అధికారులకు వినతి

కంభం: గృహాల్లో వినియోగించే గ్యాస్ సిలిండర్ల బరువులో తేడాలు వస్తుండటంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. నేటి సమాజంలో రోజురోజుకూ గ్యాస్ వినియోగం పెరిగిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలు కట్టెల పొయ్యిలను వదిలేసి గ్యాస్ పొయ్యిలను వినియోగిస్తున్నారు. గృహాల్లో వినియోగం ఆధారంగా 2-3 నెలలకో సిలిండర్‌ను లబ్ధిదారుడు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకొని వినియోగిస్తున్నారు. పెద్ద పెద్ద హోటల్స్, రెస్టారెంట్‌లో కమర్షియల్ సిలిండర్లు ఉండగా చిన్న చిన్న టీషాపులు, దుకాణాల్లో, గృహాల్లో వినియోగించే సిలిండర్లు వాడుకుంటున్నారు. ఇలా నిత్యం ఏదో రకంగా ప్రజలు గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. కొన్నిచోట్ల డెలివరీ చేసే సమయంలో రశీదులో ఉన్న నగదుకన్నా అదనంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



30 కేజీలు ఉండాల్సిన సిలిండరు బరువు 28.060 గ్రాములు చూపిస్తున్న దృశ్యం

సిలిండర్‌ల బరువుల్లో తేడా

వినియోగదారుడు కొనుగోలు చేసే ప్రతి గ్యాస్ సిలిండర్‌పై సిలిండర్ బరువు, అందులో నింపే గ్యాస్ బరువును ముద్రించి ఉంటారు. గ్యాస్ డెలివరీ చేసే ఆటోలో ఒక కాటా పెట్టుకొని వినియోగదారుడికి బరువు చూపించి సిలిండర్ ఇవ్వాల్సి ఉంది. చాలా ఆటోల్లో అవి కనిపించవు. కొన్ని ఆటోల్లో కాటా ఉన్నా ఎవరూ వాటిని వినియోగించరు. సిలిండర్ తీసుకెళ్లి ఇంట్లో దించి ఖాళీ సిలిండర్ తీసుకెళ్తుంటారు తప్పా బరువు వేసి ఇవ్వరు. తరుచూ గ్యాస్ వినియోగించే వారికి ఒక సిలిండర్ ఎన్ని రోజులు వస్తుందో ఓ అవగాహన ఉంటుంది. ఇటీవల కాలంలో పలువురు వినియోగదారులు గ్యాస్ త్వరగా అయిపోతుందన్న అనుమానంతో తూకాలు వేసి చూస్తుండటంతో కేజీ నుంచి 2 కేజీల వరకు తక్కువ వస్తుందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. సిలిండర్లు కంపెనీ నుంచి నేరుగా వస్తాయని స్థానికంగా ఉండే గోడౌన్లలో ఎటువంటి మార్పులు జరగవని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. సిలిండర్ బరువు తక్కువగా ఉంటే వెంటనే మార్చి ఇంకో సిలిండర్ ఇస్తామని చెబుతున్నా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారులకు సిలిండర్ ఇచ్చే సమయంలో కాటా వేసి మాత్రం ఇవ్వడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మోసం జరగకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

వినియోగదారులకు నష్టం కలిగిస్తే ఎలా



వినియోగదారులు సిలిండర్ డెలివరీ చేసుకొనే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. సిలిండర్ బరువులో తేడా ఉన్నట్లు అనిపిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి. అదే సమయంలో సిలిండర్ డెలివరీ ఇచ్చే వారు కాటా వేసి వినియోగదారుడికి సిలిండర్లు అందించి రశీదులో పొందుపరిచిన నగదు తీసుకోవాలి.

– ఓసీహెచ్ నరసింహులు, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు

సిలిండర్ బరువులో తేడా లేకుండా చూడాలి



సిలిండర్ మీద ముద్రించిన ప్రకారం సిలిండర్ బరువు ఉండాలి. తక్కువ బరువు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇటీవల కాలంలో తూకాల్లో తేడా వస్తుంది. కేజీ నుంచి కేజిన్నర వరకు సిలిండర్ బరువు తగ్గుతుంది. పూర్తి బరువున్న సిలిండర్‌కు డబ్బులు తీసుకుంటున్నప్పుడు బరువులో తేడా రాకుండా చూసుకోవాలి.

– మహ్మద్ ఇబ్రహీం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత



ఉప్పలపాడులో అర్జీలు పరిశీలిస్తున్న జేసీ



మార్కాపురం : అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

- రెవెన్యూ సదస్సులో జేసీ గోపాలకృష్ణ

పొదిలి రూరల్: గ్రామాల్లో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఉపయోగపడుతాయని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. పొదిలి మండలంలోని ఉప్పలపాడులో రెవెన్యూ సదస్సును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. భూ వివాదాలు, భూ ఆక్రమణలు, పాసు పుస్తకాలపై వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి రైతులకు రశీదులు ఇస్తామన్నారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, సర్వేయర్ గురవయ్య, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సభలో 56 అర్జీలు

గిద్దలూరు రూరల్: మండలంలోని వెల్లుపల్లెలో స్థానిక తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభలో స్థానిక ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు వివరించారు. రేషన్ కార్డుల్లో పేరు మార్పులు, రేషన్‌కార్డుల కోసం, పట్టాదారు పాసుపుస్తకాల్లో పేరు మార్పులు వంటి సమస్యలపై మొత్తం 56 అర్జీలు వచ్చాయి. ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారం కోసం కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. రెవెన్యూ సభలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని, సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాల్సిందిగా ఆయన కోరారు. ఆర్ఐ భాస్కర్‌రావు, వీఆర్‌ఓలు రామయ్య, వైపీ రంగయ్య పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

మార్కాపురం రూరల్: మండలంలోని మాల్యవంతునిపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించిన తహసీల్దార్ చిరంజీవి.. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ సంజీవయ్య, రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

కొనకనమిట్ల: లోకరక్షకుడు ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని స్థానిక ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ఎస్పీ బాలయ్య పేర్కొన్నారు. మంగళవారం కొనకనమిట్ల ప్రాథమిక వైద్యశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 25న ఏసుక్రీస్తు పుట్టిన రోజును అందరూ సంతోషంగా గడుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు సురేఖ, నరేంద్ర, పృథ్వీరాజ్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెచ్ఈఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న వైద్యాధికారులు

రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు



పైపు లైన్ కోసం ప్లాట్‌ఫాంపై అడ్డంగా తీసిన గుంతలు



ప్రయాణికులు నడిచేందుకు వీల్లేకుండా ఉన్న గుంతలు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం ఆవరణలో పైపులైన్ గుంతలు ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ పైకప్పుపై పడిన వర్షపు నీరు బయటకు పంపేందుకు ప్లాట్‌ఫాంపై గుంతలు తీసి అలాగే వదిలేశారు. వారం రోజులు కావస్తున్నా పనులు నత్తనడకన నడుస్తున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, గుంతకల్, మార్గమధ్యంలోని గిద్దలూరు రైల్వే స్టేషన్ మీదుగా రోజుకు వందల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. రైలు వచ్చి ప్రయాణికులు దిగి ఎక్కే సమయంలో ఈ గుంతలు మరింత ఇబ్బందికరంగా మారాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ పైకప్పుపై పడ్డ వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు కొత్తగా ఏర్పాటు చేసే పనులను వేగవంతం చేయకుండా నెమ్మదిగా చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం నిత్యం రద్దీగా ఉండే రైల్వేప్లాట్ ఫామ్‌పై పనులకు యుద్ధప్రాతిపదికన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కత్తెర పురుగుతో మొక్కజొన్నకు నష్టం



మొక్కజొన్న రైతులకు సూచనలిస్తున్న ఏఓ మెర్సీ

బేస్తవారిపేట: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు కనిపిస్తోందని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. మంగళవారం మండలంలోని గంటాపురం, చెరుకుపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నివారణకు వేపనూనె లీటర్ నీటికి 5 ఎంఎల్, ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా లీటర్ నీటికి క్లోరాంట్రినిప్రోల్ 0.4 ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత మాట్లాడుతూ రసం పీల్చు పురుగు నివారణకు ఎకరానికి 8 కిలోల ఫిప్రోనిల్ గుళికలు చల్లుకోవాలని సూచించారు. వీఏఏలు పాల్గొన్నారు.

ఆలయంలో సుదర్శన హోమాలు



పారాయణంలో పాల్గొన్న భక్తులు

బేస్తవారిపేట: స్థానిక తేరుబజార్‌లోని పట్టాభిరామ స్వామి ఆలయ మహా సంప్రోక్షణ సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం, అరుణ పారాయణం, మూల విరాట్, ఉత్సవ విగ్రహాలకు పంచగవ్యాలు, పంచామృతాలు, అభిషేకాలు, చండీ పారాయణ, సుదర్శన హోమాలు, సాయంత్రం చండీ హోమం, వేదపారాయణ, పుష్పయాగం, పంచహారతి పూజలు చేశారు.

కుక్కల దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు

కంభం: పట్టణంలో మంగళవారం రాత్రి ముగ్గురు కుక్కకాటుకు గురయ్యారు. కందులాపురం కూడలి సమీపంలో రమేష్ అనే వ్యక్తి కుక్కకాటుకు గురవ్వగా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాడు. మరోచోట శ్రీవల్లి అనే చిన్నారిని పిచ్చికుక్క తీవ్రస్థాయిలో గాయపరిచింది. చిన్నారి నడుము వద్ద, కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరితో పాటు మరో వ్యక్తి కుక్క కాటుకు గురైనట్లు తెలిసింది. ఇటీవల కాలంలో కుక్కల బారిన పడి గాయపడే వారు అధికమవుతున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారి

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు



గొట్లగట్టులో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవనం



నిర్మాణం పూర్తి కాని మరుగుదొడ్లు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న నూతన అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా నిలిచాయి. మండలంలో 26 గ్రామ పంచాయతీల్లో 72 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 25 ప్రభుత్వ భవనాలు కాగా 28 అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. 19 మాత్రం పలు ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమం కింద గొట్లగట్టు, నాగరాజుకుంట, పుట్లూరివారిపల్లి గ్రామాల్లో రూ.13 లక్షల మేర నిధులు మంజూరు చేయడంతో నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణ పనులు పూర్తిగా ఆగిపోవడంతో ఆయా భవనాల చుట్టూ చిల్లచెట్లు పెరిగిపోయాయి. పలు కేంద్రాల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ అవి కూడా అసంపూర్తిగా మిగిలాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై సీడీపీఓ సుధామారుతి వివరణ కోరగా.. 'భవనాల నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. వీలైనంత త్వరలో భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులు కీలకం



మాట్లాడుతున్న ఎంపీడీఓ, పక్కన డీఎల్‌డీఓ

కొనకనమిట్ల: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలక బాధ్యత వహించాలని డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు ఎంపీడీఓ ఈశ్వరమ్మ పర్యవేక్షణలో సుస్థిర అభివృద్ధి-లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రణాళికలపై చర్చించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ.. జనవరి నుంచి ఉపాధి హామీ పథకంలో కూలీ రేట్లు పెంచనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈఓపీఆర్డీ శ్రీదేవి, పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి

గిద్దలూరు రూరల్: రైతులు తమ పంటల వివరాలను నమోదు చేసుకోవాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తకోట, కొమ్మునూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అతివృష్టి అనావృష్టి సంభవించినప్పుడు పంట నమోదు చేసుకున్న వారికి నష్టపరిహారంతో పాటు ప్రభుత్వం ఆర్థికంగా మద్దతుగా ఉంటుందన్నారు. ఈ సీజన్‌లో శనగ, మినుము, వరి, జొన్న, మొక్కజొన్న, ఎండుమిరప, వంటి పంటలు బీమా పథకం కింద వర్తిస్తాయన్నారు. ఈ సందర్భంగా మిరప, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఉద్యానవన శాఖ అధికారి విష్ణుప్రియ మిరప పంటలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యవసాయవిస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సంచాలకులు శేఖర్, మహ్మద్ పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



మాట్లాడుతున్న బాదుల్లా

- ప్రభుత్వానికి విశ్రాంత ఉద్యోగుల డిమాండ్

పొదిలి: పెన్షనర్లకు రావాల్సిన రెండు డీఆర్‌లు, పీఆర్సీ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పెన్షనర్ల సంఘ సభ్యులు ఆకుమల్ల బాదుల్లా, షేక్ మధార్‌వలి, జిల్లా కార్యదర్శి సుబ్బారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పెన్షనర్ల భవనంలో పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన మంజూరుకు ముఖ్య కారకుడైన డీఎస్ నకారకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సుబ్బారావు, బాదుల్లా మాట్లాడుతూ.. పెన్షన్ కోసం ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన అవసరం లేదన్న సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ప్రకారం తమ బకాయిలు చెల్లించాలన్నారు. గతంలో తగ్గించిన అడిషనల్ క్వాంటంను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి హనుమంతరావు, స్థానిక పెన్షనర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలకు కృషి చేస్తా

గిద్దలూరు రూరల్: పెన్షనర్ల సమస్యలకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విఠా సుబ్బరత్నం కళ్యాణ మండపం ఆవరణలో మంగళవారం విశ్రాత ఉద్యోగులకు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెన్షనర్లకు పీఆర్సీ, ఐఆర్ విషయమై శాసనసభలో లేవనెత్తి వారి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తానన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సభ్యులకు సన్మానం చేశారు. విశ్రాంత ఉపాధ్యాయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆంధ్ర ప్రగతి బ్యాంక్ రీజనల్ మేనేజర్ రఘురామ్, మేనేజర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

స్పర్శ్ పెన్షన్ విధానంపై అవగాహన ఉండాలి



కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

కంభం: స్పర్శ్ పెన్షన్ విధానంపై మాజీ సైనికులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి రజనీకుమారి అన్నారు. కంభం మండల మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న కంటైనర్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమాధికారి మాట్లాడుతూ ఇటీవల రాజ్య సైనిక బోర్డు వారు ప్రారంభించిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. స్పర్శ్ పెన్షను విధానంలోని సమస్యలు వెలువడితే ఎలా పరిష్కరించుకోవాలో అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మండల మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు శెట్టెం వేణుగోపాల్, సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని), మాజీ సైనికులు పుల్లయ్య, సోలయ్య, ప్రసాద్, అంకయ్యగౌడ్, మస్తాన్ వలి, ఆరు మండలాల సైనిక సంఘ నాయకులు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

అర్థవీడు: మండలంలోని గన్నేపల్లి ఎరువుల దుకాణంలో ఏడీఏ బాలాజీనాయక్, వ్యవసాయాధికారి మహ్మద్‌లు తనిఖీ చేశారు. లక్షా పదిహేడు వేల రుపాయల విలువైన ఎరువులను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. రికార్డుల్లో నమోదు చేసిన స్టాకు, గోడౌన్లో ఉన్న స్టాక్‌కు పొంతన లేనట్లు గుర్తించినట్లు చెప్పారు. వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.